ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శనివారం | జులై 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 38 | పేజీలు : 2


## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ స్పీడప్ చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా కేటాయింపు
- బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశం



2లో

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన.

– రేవంత్ రెడ్డి, సీఎం



- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు
- అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి

## రాబోయే ఎన్నికల్లో.. అధికారం మాదే

### వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

**ఖమ్మం, ఆయుధం:** వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తామని, కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు.



**పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశాం**

బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.

**కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు**

నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు.

**భద్రాచలం రాముడు మునగాలా?**

మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని సవాల్ విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతాం" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.





## కేటీఆర్ ను కలిసిన ఎంపీ రవిచంద్ర

**హైదరాబాద్, ఆయుధం:** బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్, పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నియమితులైన సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



## జీవనోపాధి కల్పనకు కట్టుబడి ఉన్నాం


- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- భద్రకాళి మాడ వీధుల బాధిత కుటుంబాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రభావితమైన కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించే చర్యల్లో భాగంగా, అర్హులైన 30 మంది బాధితులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, గృహ, ఉపాధి పథకాల ప్రయోజనాలు కూడా అర్హులైన కుటుంబాలకు అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## తిరుపతిలో 'మల్లారెడ్డి డీమ్డ్ వర్సిటీ': ఎమ్మెల్యే మల్లారెడ్డి

**తిరుమల, ఆయుధం:** తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి దర్శించుకున్నారు. శ్రీవాణి ట్రస్ట్ దాతల దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. ''మూడున్నర దశాబ్దాల్లో అనేక విద్యాసంస్థలు స్థాపించా. తిరుపతిలో యూనివర్సిటీ పెట్టాలని గతేడాది అనుకున్నా. ఇక్కడ మల్లారెడ్డి డీమ్డ్ వర్సిటీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది'' అని ఆయన తెలిపారు.



## కేయు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్

**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి చెత్త చెదారం ఏమి లేకుండా అధ్యాపకులు విద్యార్థులు బోధనేతర సిబ్బంది కలిసి కళాశాల చుట్టూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె భిక్షాలు మాట్లాడుతూ కళాశాల చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని కళాశాలలో ఎప్పుడు పూల మొక్కలతో పచ్చని పరిసరాలతో కలకలలాడుతూ ఉండేలా ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సాధించాలని ఎన్విరాన్మెంట్ బాగా ఉన్నప్పుడే మానసికంగా మనం సంతోషంగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బోధనెత్తర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకున్న వారే నిజమైన జర్నలిస్టులు

- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఆయుధం:** ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా, నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకునేవారే నిజమైన జర్నలిస్టులని, అలాంటి వారినే సమాజం అక్కున చేర్చుకుంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దాని విలువ లేకుండా చేసారని, ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. అక్రెడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీడియా రంగాన్ని కలుషితం చేస్తూ అపహాస్యానికి గురిచేస్తున్న వారిని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరగా చేసుకుంటూ, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు సాధించుకున్న సౌకర్యాలను, చట్టాలను రద్దు చేసేస్తుందని, ఆ చర్యలను అడ్డుకోవాలంటే జర్నలిజం వృత్తి నిబద్ధతను మనం నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. సామాన్యుల భావప్రకటన స్వేచ్ఛకు సోషల్ మీడియా మంచి వేదిక అయినప్పటికీ, అందులో మంచితో సమానంగా చెడు, కల్పితాలు, అవాస్తవాలు ట్రోల్ అవుతుండడంతో దానికి విలువ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంతోనే దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరిస్తూ కఠినమైన నిర్ణయాలను తీసుకోబోతుందని ఆయన అప్రమత్తం చేసారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో వీడియో జర్నలిస్టులు సంఘటితమై బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఫోటో గ్రఫీ డే మాదిరిగానే వీడియో గ్రఫీ డే ను కూడా నిర్వహించడానికి అకాడమీ యోచిస్తుందన్నారు. ఏఐ ను తట్టుకొని నిలబడే విధంగా వీడియో జర్నలిస్టులకు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా వీడియో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆయా మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులతో పాటు ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వీడియో జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని విరాహత్ అలీ కోరారు. తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సన్నీ, అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అక్రెడిటేషన్ కార్డుల ప్రధానోత్సవం జరిగింది.

## ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే
# ఏడాది జైలు శిక్ష

- 'సర్' పొడిగింపు మా పరిధిలో లేదు : సీఈవో సుదర్శన్ రెడ్డి
- ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్
- జూన్ 25 నుంచి జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాల అందజేత




హైదరాబాద్, ఆయుధం: ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్ చేపడుతున్నామని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు అందిస్తున్నామని వెల్లడించారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనూ సేవలు : ప్రతి వ్యక్తికి రెండు ఎన్యూమరేషన్ పత్రాలు ఇస్తామని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రెండు ఎన్యూమరేషన్ పత్రాలు నింపి, ఒకటి బీఎల్‌వోకు ఇవ్వాలన్నారు. రెండో ఎన్యూమరేషన్ పత్రాన్ని ప్రజల దగ్గరే ఉంచుకోవాలని చెప్పారు. ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటుందని వెల్లడించారు. ఒకవేళ ఎన్యూమరేషన్ పత్రం ఇవ్వలేకపోతే ఫామ్ 6 ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోతే ఫామ్ 6 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనూ ఎన్యూమరేషన్ పత్రాలు నింపవచ్చని చెప్పుకొచ్చారు.

"ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రంలో జూన్ 10వ తేదీ నాటికి 3 కోట్ల 38లక్షలకు పైగా ఓటర్లున్నారు. అందులో మృతి చెందిన, వలస వెళ్లిన వాళ్ల ఓట్లను తొలగించడానికే పూర్తి వివరాలు సేకరిస్తున్నాం. ఒక ఓటరుకు ఒకే ఓటు ఉండాలి. రెండుచోట్ల ఉంటే చట్టప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నేరానికి ఏడాది జైలు శిక్ష ఉంటుంది. హైదరాబాద్, మేడ్చల్‌లో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కాస్త ఆలస్యమవుతోంది" అని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

సమాచారం ఇచ్చిన తర్వాతే ఓటు తీసెయ్యాలి ఓటును కావాలనే తొలగించరని, అలా తొలగించాలంటే ఆషామాషీ విషయం కాదని సీఈవో వెల్లడించారు. ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చే తీసెయ్యాలని స్పష్టం చేశారు.

"ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌ల ప్రకారం పంపిణీ చేయడంలో కొన్ని ఇబ్బందుల్ల వల్ల పత్రాల పంపిణీలో ఆలస్యం అవుతోంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ముగిసింది. ప్రస్తుతం తెలంగాణతో కలిపి 17 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. రోహింగ్యాలకు ఓటు హక్కు ఉన్నట్లు తేలితే ఈఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ఓట్లను తొలగిస్తారు. 'సర్' గడువు పొడిగింపు మా పరిధిలో లేని అంశం." అని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# ఎస్ఐఆర్ సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలి
- భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ



**ములుగు, ఆయుధం:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం పూర్తయిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 33.31 శాతం పూర్తయిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ప్రతి బీఎల్‌ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి బీఎల్‌ఓకు ముగ్గురు వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి సహకారం అందించాలని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సూపరింటెండెంట్ సలీమ్, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా కేటాయింపు
- బీఎల్‌ఓలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశం




**హనుమకొండ, ఆయుధం:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రవితో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల వారీగా ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శని, ఆదివారాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉన్న నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ బీఎల్‌ఓలకు ప్రత్యక్షంగా సహకరించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి దరఖాస్తును సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం, అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండదని, లక్ష్య సాధనలో ప్రతి అధికారి, ఉద్యోగి పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా వెనుకబాటు కనిపిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో ఇన్ఫినిట్ స్క్రోల్‌ను తీసేయండి!

**జాతీయం, ఆయుధం:** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ డిజైన్‌ను మార్చాలని, లేదంటే భారీ జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని మెటాను యూరోపియన్ యూనియన్ కమిషన్ హెచ్చరించింది. ఆయా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోల ఆటోప్లే, ఇన్ఫినిట్ స్క్రోల్ ఫీచర్లు వినియోగదారులకు వ్యసనంగా మారాయని ఆరోపించింది. దీనివల్ల ముఖ్యంగా పిల్లలు, యువత వాటికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేసింది. అవసరమైన మార్పులు చేయకపోతే మెటా తన గ్లోబల్ వార్షిక టర్నోవర్‌లో 6 శాతం వరకు భారీ జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.




## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**గౌచర్ల, ఆయుధం:** విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గౌచర్ల క్రాస్‌రోడ్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా AISF జిల్లా కార్యదర్శి ల్యాధల్లా శరత్, SFI జిల్లా కార్యదర్శి పైసా గణేష్, PDSU జిల్లా సహాయ కార్యదర్శి దండు వినయ్, AISB జిల్లా నాయకుడు తాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, 27 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకుని ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించే సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో AISF జిల్లా నాయకులు వర ప్రసాద్, కార్తీక్, కౌశల్, AISB జిల్లా నాయకులు షారుక్, వసీం, సలీం, ప్రశాంత్, ప్రవీణ్, మహేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా జరగాలి
- క్షేత్రస్థాయిలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వొద్దని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాజీపేటలోని మార్కెట్, హనుమకొండలోని మేకలు, గొర్రెల వధశాల, హనుమకొండ ప్రెస్ క్లబ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలోని పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కాజీపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమకొండ వధశాలల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకుని, పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్, పనులను మరింత వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగిస్తూ రోగులు, వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు డా. గోపాల్‌రావు, ఎంహెచ్‌వో డా. రాజేష్, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, ఏఈ హరికుమార్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదు

- హన్మకొండ లో వామపక్ష విద్యార్థి సంఘాల ర్యాలీ, రాస్తారోకో
- హన్మకొండ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం




**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, విద్య రంగాభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించడం చేతగాక పోతే తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పూర్తిగా విజయవంతం అయింది. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించగా, ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సంపూర్ణ బంద్ పాటించాయి. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కాకతీయ యూనివర్సిటీ ఎస్.డి.ఎల్.సి.ఇ. జంక్షన్ నుండి వందలాది మంది విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ తీసి, మర్కాజి స్కూల్ సెంటర్ లోని మెయిన్ రోడ్డు పై గంట సేపు రాస్తారోకో నిర్వహించగా పోలీసులు వచ్చి విద్యార్థి సంఘల నాయకులను అరెస్టు చేసి బలవంతంగా హనుమకొండ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా బాధ్యులు భాష బోయిన సంతోష్(ఏఐఎస్ఎఫ్), మంద శ్రీకాంత్(ఎస్ఎఫ్ఐ), బి.నరసింహారావు(పి.డి.ఎస్.యు), మాస్ సావిత్రి (ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్), మర్రి మహేష్ (పి.డి.ఎస్.యు), రోహిత్ (ఎ.ఐ.ఎస్.బి), వెంకటేష్ (ఎ.ఐ.డి.ఎస్.ఓ) లు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో విద్యారంగం పూర్తిగా భ్రష్టు పట్టిపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరచుకోని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, తక్షణమే పెండింగ్ లో ఉన్న 9వేల కోట్ల రూపాయల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్సత్ సౌకర్యం కల్పించాలని, ఇంటర్, డిగ్రీ కాలేజీలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బిసి ఎస్ఎంఎస్ హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో అన్ని విద్యార్థి సంఘాలు సంఘటితమై పెద్ద ఎత్తున ఉద్యమించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరీ ప్రణీత్, పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు వంగేటి మోహన్, ఎ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు మిస్బా, తాజుద్దీన్, సమీర్, పి.డి.ఎస్.యు. జిల్లా నాయకులు వంశీ, కార్తీక్, ఏ.ఐ.డి.ఎస్.ఓ. జిల్లా నాయకులు మధు, సురేష్ పాల్గొన్నారు.




## ఇంగ్లాండ్ పిచ్ పరిస్థితులను సృష్టించాం

**జాతీయం, ఆయుధం:** ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా టీ20 సిరీస్‌ను ఆడుతోంది. ఐదు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే భారత్ కోల్పోయింది. ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది. ఆ తర్వాత జులై 14 నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. సీనియర్ క్రికెటర్లు రోహిత్, విరాట్ కోహ్లీ బరిలోకి దిగుతారు. ఇప్పటికే వీరిద్దరూ ఇంగ్లాండ్‌కు చేరుకున్నారు. కెరీర్ ఆరంభంలో ఇంగ్లిష్ గడ్డపై విరాట్‌కు గొప్ప గణాంకాలు ఏమీ లేవు. కానీ, ఆ తర్వాత శ్రమించి మరీ ఫామ్‌ను అందుకొన్నాడు. ఇప్పుడు మరోసారి మంచి ఆటతీరు కనబరచాలని కోహ్లీ పట్టుదలగా ఉన్నాడు. మాజీ కోచ్ సంజయ్ బంగర్‌తో కలిసి ప్రత్యేకంగా సాధన చేశాడు. ఈ క్రమంలో విరాట్ ఎలా సన్నద్ధమయ్యాడో తాజాగా ఓ ఇంటర్వ్యూలో బంగర్ వెల్లడించాడు. ‘‘ఇంగ్లాండ్‌లో ఆడేటప్పుడు రెండు విషయాలను గుర్తు పెట్టుకోవాలి. స్వింగ్‌కు ఎలా కౌంటర్ ఇవ్వాలి. బంతిని ఎంత లేటుగా ఆడామనేదే ముఖ్యం. అందుకోసం విరాట్ చాలా శ్రమించాడు. ఇప్పుడే కాదు గతంలోనూ అతడు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు. విరాట్ (Virat Kohli) 2014 పర్యటనకు వెళ్లినప్పుడు పెద్దగా పరుగులు చేయలేదు. ఆ సమస్య నుంచి బయటపడేందుకు ఆ తరహా పిచ్‌లను సిద్ధం చేయించుకున్నాడు. చివరికి 201718 సీజన్‌లో అద్భుతంగా ఆడాడు’’ అని బంగర్ తెలిపాడు.



## నంగునూరులో మెగా పామాయిల్ ప్లాంటేషన్

- మొక్కలు నాటిన ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

సిద్దిపేట/నంగునూర్, ఆయుధం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో నంగునూరు మండలం మగ్గంపూర్ లో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతు శేరి సురేందర్ రెడ్డి, వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సాదుల. పవన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి గీత పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. అనంతరం రైతులతో మాట్లాడిన వారు, ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు అధిక సంఖ్యలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. అలాగే పంట నిర్వహణ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, మొక్కల సంరక్షణ వంటి అంశాలపై రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాకాల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఎండి ఇమ్రాన్, పవన్, శ్రీకాంత్ రెడ్డి, బాపురాజు, చైతన్య, ప్రవళిక, మౌనిక, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ నితీష్, వాసవి యాదమల్లు, బండారు ప్రసాద్ రెడ్డి, అచ్చిన మల్లయ్య, అల్లిబిల్లి నర్సింగరావు, ఎండి ఎస్ దాని, పాలారపు తిరుపతిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పరమేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, శంకరయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న
- నక్కలగుట్ట బల్దియా సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్, ఆయుధం:** ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని నక్కలగుట్ట బల్దియా సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్, కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, స్టోర్ రూమ్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ఫైళ్ల భద్రపరిచే విధానం, ప్రజలకు అందుతున్న సేవలు, కార్యాలయ నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణ, బాధ్యత, సమయపాలన ప్రతిబింబించేలా అధికారులు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఇబ్బందులు పడకుండా వారికి సత్వర సేవలు అందించాలని, కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, మాధవీలత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695